క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెద్దశంకరంపేట(మెదక్): సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన తప్పకుండా ఉండాలని డాక్టర్‌లు దీమ్‌నాథ్‌రెడ్డి, సౌరభ్ అన్నారు. శుక్రవారం నేషనల్ హైవే పెద్దశంకరంపేట ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సమగ్ర సీపీఆర్(కార్డియోపల్మనరీ రిససిటేషన్) మాక్ డ్రిల్ శిక్షణా శిబిరాన్ని జంబికుంట కార్యాలయంలో నిర్వహించారు. సహారా ఆస్పత్రి సంగారెడ్డి ఆధ్వర్యంలో సీపీఆర్ టెక్నిక్స్ వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ ఖాజామొయినొద్దీన్, సేఫ్టీ మేనేజర్ బాలరాజు, పీఆర్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు

నర్సాపూర్: పట్టణానికి చెందిన ఆయా శాఖలకు చెందిన పలువురు అధికారులు బదిలీ అయ్యారు. అటవీ శాఖకు చెందిన ఫారెస్ట్ రేంజ్ అధికారి అంబర్‌సింగ్, అదే శాఖలో సెక్షన్ అధికారి బాలేశం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు బదిలీ అయ్యారు. అలాగే అటవీ శాఖలో ముగ్గురు బీట్ ఆఫీసర్లు సైతం బదిలీ అయ్యారు. కాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ నీలఫర్ రాణి బదిలీపై మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ అయినా.. ఆమె స్థానంలో ఎవరు రాలేదు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ నీలకంఠం సూచించారు. మండలంలోని అంసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ నీలకంఠం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈఓ అక్కడి నుంచి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం గీతాదేవి, సీఆర్పీలు శ్రీనివాస్, సాయికుమార్ ఉన్నారు.

విద్యార్థులు గొప్పగా ఎదగాలి

చేగుంట(తూప్రాన్): కార్గిల్ వీరుల స్ఫూర్తితో భారత్‌ను విశ్వగురువుగా చేసే దిశగా విద్యార్థులు గొప్పగా ఎదగాలని వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి రావినూతల శశిధర్ అన్నారు. చేగుంటలోని ప్రభుత్వ కళాశాల మోడల్ కళాశాల విద్యార్థులతో కార్గిల్ విజయ్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల క్రితం కార్గిల్ విజయం కోసం వీర మరణం పొందిన కొంతమంది జవాన్లకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా బాధ్యులు మల్లేశం, ప్రభాకర్, బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ మండల బాధ్యులు సోమసురేష్, నవీన్, అమర్, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



మనోహరాబాద్(తూప్రాన్): యువతి అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాయపల్లి గ్రామానికి చెందిన తొటి స్వామి కూతురు సౌజన్య (19) గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టూ పక్కల వెతికినా.. ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొట్టాలలో నీటి సమస్య



నీటి కోసం అవస్థలు పడుతున్న జనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. కాలనీలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ మంచినీళ్లు రావడంలేదని చెప్పారు. ఎవరికి చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని వారు కోరారు.

అంధకారంలో ధనలక్ష్మి కాలనీవాసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని ధనలక్ష్మి కాలనీ అంధకారంలో ఉంది. వారం రోజుల నుంచి కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో చీకటిలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అనాథల కోసం ఆధార్ క్యాంపు

● సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపిన ఆశ్రమ నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): పదేళ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్య సాక్షి దినపత్రికతో పరిష్కారం అయింది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బేతాని సంరక్షణ నిలయంలో ఉన్న అనాథలకు ఆధార్ ఏదీ కథనం సాక్షి దినపత్రికలో గత నెలలో ప్రచురితమైంది. అందుకు గాను సంరక్షణ నిలయంలో ఉన్న మానసిక అనాథలందరికీ ఆధార్ కార్డులు జారీ చేసేందుకు శుక్రవారం బేతాని సంరక్షణ నిలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారు. హైదరాబాదులోని యూటీడీఏఐ రిజినల్ అధికారి భవానిప్రసాద్ ఆధ్వర్యంలో ఆధార్‌కార్డు నమోదు చేపట్టారు. ఆశ్రమంలో 52 మంది మానసిక దివ్యాంగులు ఉండగా, 20 మందికి ఆధార్ కార్డులు ఉండగా మిగతా 32 మందికి బయోమెట్రిక్ ద్వారా ఆధార్ నమోదు చేశారు.



ఆశ్రమంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

అనాథలకు ఆధార్ కార్డులు కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినా.. వారు స్పందించలేదని, సాక్షి దినపత్రికలో అనాథల బాధల గురించి ప్రచురించడం వల్ల సమస్య పరిష్కారం అయిందని సంరక్షణ డైరెక్టర్ ఫాదర్ సజీవ్ వర్గీస్ సాక్షికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానసిక దివ్యాంగులకు ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు రాలేవని ఇప్పుడు ఆధార్‌కార్డులు రావడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ నమోదు అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ సింగ్, ఆపరేటర్ ప్రవీణ్, మగ్దుంపూర్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది సిస్టర్ కార్‌మాల్, విన్సెంట్, వీరబాబు ఉన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి



వెల్దుర్తిలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ రాణి, గౌడ కులస్తులు

● ఎక్సైజ్ సీఐ రాణి

వెల్దుర్తి(తూప్రాన్): వనమహోత్సవంలో భాగంగా ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి పిలుపు నిచ్చారు. మండల కేంద్రం వెల్దుర్తిలోని కుడి చెరువు కట్టకు ఇరువైపులా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఈత మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రామాయంపేట ఎక్సైజ్ పరిధిలో వనమహోత్సవంలో 10వేల ఈత మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నేటివరకు సుమారు 5వేలు మొక్కలు నాటామన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ విజయ్‌సిద్ధార్థ్, సిబ్బంది దుర్గారెడ్డి, వెంకటేశం, ఎంపీఓ విఘ్నేశ్వర్, ఈజీఎస్ ఏపీఓ రాజు, గౌడ సంఘం నాయకులు శంకరయ్యగౌడ్, నర్సింహగౌడ్, సుధాకర్‌గౌడ్, శేఖాగౌడ్, లింగంగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం

● ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్టాలలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా పారిశుద్ధ్య పనులకు పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు పరిసరాలతో పాటు మురికి కాల్వలు శుభ్రం ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం సిజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వన మహోత్సవం సందర్భంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరహరి, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గౌరీరెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వన మహోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వన మహోత్సవం నిర్వహించారు. శుక్రవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మొక్కలను నాటి, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు, ఎంపీడీఓ దామోదర్, పీహెచ్‌ఓ యాదగిరిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న అధికారులు

మట్టిరోడ్డును బాగుచేయాలి: రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): వర్షంతో మట్టిరోడ్డు బురదమయంగా మారింది. దీంతో నడవలేకపోతున్నామని రోడ్డుపై నాటు వేసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. నార్సింగి మండల కేంద్రం నుంచి శాలిపేటకు వెళ్లే మట్టి రోడ్డు బురదమయంగా మారింది. కనీసం నడిచేందుకు వీలులేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు పంటలు సాగుచేస్తున్న తాము ఎరువుల బస్తాలను పొలం వద్దకు తీసుకెళ్లేందుకు ఆటోలు నడవపోగా, కనీసం బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు స్వామిరెడ్డి, సుభాష్‌రెడ్డి, సందీప్‌గౌడ్, రాజు, స్వామి, యాదగిరి పాల్గొన్నారు.



మట్టిరోడ్డు పై నాటు వేస్తున్న రైతులు

పీఏసీఎస్ అవిశ్వాస తీర్మానం వెనక్కి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ లపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని సభ్యులు వెన క్కి తీసుకున్నారు. ఈ నెల 3న టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై 8 మంది డైరెక్టర్లు జిల్లా కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 25న అవిశ్వాస పరీక్షకు అధికారు లు సమయాన్ని కేటాయించగా, సభ్యుల కోరం లేక పోవడంతో వీగిపోయిందని ప్రకటించిన డీసీఓతో డైరెక్టర్లు నోటీసులు ఇచ్చిన ప్రకారం కోరం ఉందని వారించడంతో తర్జన భర్జన పడి అనివార్య కారణాలతో శుక్రవారం నాటికి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి(డీసీఓ) కరుణ మాట్లాడారు. అవిశ్వాస తీర్మానాన్నిసభ్యులు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం పీఏసీఎస్ చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా వెంకయ్య యథావిధిగా సొసైటీ పరిపాలన కార్యకలాపాలను కొనసాగిస్తారని తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్లలో అసాంఘిక పనులు

నర్సాపూర్: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లలో పలువురు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నందున ఎవరికి పంపిణీ చేయలేదు. వాటిని కొందరు వ్యక్తులు పగటి పూట పేకాట ఆడుతున్నారని, రాత్రి పూట సైతం అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పేకాట, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని వారు పోలీసులను కోరుతున్నారు.

సిగ్నల్స్‌కు మరమ్మతులు



నర్సాపూర్ చౌరస్తాలో పనిచేస్తున్న సిగ్నల్స్

నర్సాపూర్: సిగ్నల్స్ వ్యవస్థ అస్తవ్యస్తం అని ఈనెల 16న సాక్షిలో వచ్చిన కథనానికి మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్ స్పందించారు. చాలా రోజులుగా సిగ్నల్స్ పని చేయక వాహనదారులు ఇబ్బందులకు గురైన విషయాన్ని సాక్షి వెలుగులోకి తేవడంతో కమిషనర్ స్పందించి సిగ్నల్స్ మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు.

వెల్దుర్తి ఎంపీడీఓగా ఉమాదేవి



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి ఎంపీడీఓగా శుక్రవారం ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జగదీశ్వరాచారి పదవీ విరమణ చేశారు. దీంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎంపీడీఓగా పనిచేసిన ఉమాదేవి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులకు అందేలా చూస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో ఏవైనా సమస్యలుంటే నేరుగా సంప్రదిస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు.

ఆరోగ్య వివరాల సేకరణ

రామాయంపేట(మెదక్): కీళ్ల వాపులతో పాటు జ్వరాలతో అస్వస్థతకు గురైన మండలంలోని సుతారిపల్లి గ్రామస్తులను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ పరామర్శించారు. గ్రామంలో కొనసాగుతున్న ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి రోగుల వివరాలు, పరిస్థితి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించిన ఆయన రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని కాల్వ ద్వారా తీసివేయించారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించి వారిని చైతన్యపర్చారు. అనంతరం సత్యనారాయణ తొనిగండ్ల, అక్కన్నపేట, గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.

రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

● ఏడీఏ పుణ్యవతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని చిట్కుల్ చౌరస్తాలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, స్టాక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువుల దుకాణ నిర్వాహకులు రైతులకు ఆయా రకాల బస్తాలు అమ్మే సమయంలో తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్న రైతు ఆధార్ నంబర్ తీసుకోవాలన్నారు. కొనుగోలు దారులకు తప్పనిసరిగా బిల్ ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి, ఏఈఓ భూపాల్, ఫర్టిలైజర్ దుకాణం నిర్వాహకులు వెంకటేశం, రైతులు ఉన్నారు.



చిట్కుల్ చౌరస్తా వద్ద ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి

రైతులకు న్యాయం చేయాలి



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి, ఇతర నాయకులు, రైతులు

నర్సాపూర్: భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేసి రైతుల రిలే దీక్షలు విరమింపచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. సంగారెడ్డి రీచ్ కాల్వకు భూములు ఇవ్వమని రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రైతులకు ఆయన శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. ట్రిపుల్‌ఆర్, కొండ పోచమ్మ కాల్వ, సంగారెడ్డి రీచ్ కాల్వలకు భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం అందజేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. దీక్షల్లో ఆయా గ్రామాల రైతులు, సీపీఎం నాయకులు నాగరాజు, నరేశ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని నిరసన



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిధులు కేటాయించనందుకు బీజేపీ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి చౌరస్తాలో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం విచారకరమని అన్నారు. హామీలకు నిధులు కేటాయించకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రమణరావు, సురేశ్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్, నగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు



నర్సాపూర్: మాట్లాడుతున్న వైద్య సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఇతర అధికారులు



అల్లాదుర్గం కేజీబీవీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ బుచ్చనాయక్

నర్సాపూర్: వర్షాకాలం సీజన్ కావడంతో ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైత్‌రాం నాయక్, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో తిరిగి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరిగి మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందరు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. వారి వెంట కౌన్సిలర్లు రాంచందర్, రుక్కమ్మలతో పాటు పలువురు డాక్టర్ రఘువరన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకుంటూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండలంలోని ప్రత్యేకాధికారి మాన్యనాయక్ అన్నారు. ఆయన, అధికారులతో చిలప్‌చెడ్‌లో డ్రై డే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీఓ ఆనంద్, ఏఎస్‌ఓ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

చిన్నశంకరరంపేట(మెదక్): గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ఎంపీడీఓ దామోదర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని పలువురికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్‌ఎం నాగమణి పాల్గొన్నారు. మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మనోహరాబాద్(తూప్రాన్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి ఫీవర్, తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల పీహెచ్‌సీ వైద్యులు వికాస్, సీహెచ్‌ఓ బాల్‌నర్సయ్య, సూపర్‌వైజర్ శారద, వినోద, గ్రామ కార్యదర్శి రూప, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

వడియారం గ్రామంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ ప్రజలకు సీజనల్ వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

అల్లాదుర్గం(మెదక్): విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఏ వ్యాధులు రావని ఎంఈఓ బుచ్చనాయక్ చెప్పారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా అల్లాదుర్గం కేజీబీవీని తనిఖీ చేశారు. కేజీబీవీలో పరిసరాలు, విద్యార్థినులు భోజనం చేసే డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

వెల్దుర్తి(తూప్రాన్): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ తులసీరాం పిలుపునిచ్చారు. శుక్రవారం వెల్దుర్తి పట్టణంలోని పలు కిరాణ దుకాణాలు, స్వీట్ హౌజ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డా.శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

◆ **బీజేపీ కార్యవర్గంలో కొందరికి చోటు**

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ మండల కార్యవర్గంలో మరి కొందరు క్రియాశీల నాయకులకు అవకాశం కల్పించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు తెలిపారు. శుక్రవారం బీజేపీ పదవులు పొందిన నాయకులకు నియామక పత్రాలను అందించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా మేడి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా బాబు, కార్యదర్శిగా నవీన్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా తాళ్ల శివశంకర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పెద్దోళ్ల రమేశ్‌లను నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు సురేశ్‌గౌడ్, బీజేపీ మండల నాయకులు దశరథం, నరేందర్‌రెడ్డి, మూర్తి శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫాంపండ్‌లతోనే భూగర్భ జలాల పెంపు**

టేక్మాల్(మెదక్): భూగర్భ జలాలు పెంచేందుకు రైతులు తమ పొలాల వద్ద (ఫాంపండ్) నీటి నిల్వ గుంతలు నిర్మించుకోవాలని ఏపీఓ పాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఫాంపండ్ గుంతల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. టీఏ శశికల, ఎఫ్ ఏ మోతిలాల్, రైతులు లక్ష్మణ్, పోచయ్య పాల్గొన్నారు.

◆ **రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): రైతుబీమా కోసం ఆగష్టు1 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి వ్యవసాయ కార్యాలయంలో రైతు రుణమాఫీ, రైతుబీమా దరఖాస్తులు తీసుకోవడంతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ, ఏటీఎం నరేందర్, గౌతమి రైతులు పాల్గొన్నారు.

◆ **బీజేపీని బలోపేతం చేయాలి**

టేక్మాల్(మెదక్): బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడి అధ్యక్షతన పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మల్లిక, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షులు రాములు, యువ మోర్చా అధ్యక్షుడు పవన్, గిరిజన మోర్చా అధ్యక్షులు సేనాపతి, పట్టణాధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్**

వెల్దుర్తి(తూప్రాన్): నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నుంచి ఈ నెల 29 వరకు శిక్షా సప్తాహ్(విద్యా వారోత్సవాలు) నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రామంలోని పురాతన విఠలేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు కాకతీయుల కాలంలో నిర్మించిన తోరణం, కళాకండాల విశిష్టతను రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరమణ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ **పారిశుద్ధ్యంపై సమావేశం**

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఎంపీఓ విఠల్‌రెడ్డి, సూపరింటెండెంట్ షాకీర్‌అలీ తదితరులున్నారు.

◆ **కరెంట్ బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్**

పెద్దశంకరంపేట(మెదక్): కరెంట్ బిల్లుల వసూళ్లకు శుక్రవారం పెద్దశంకరంపేటలో విద్యుత్‌శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నివాసగృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలపై పాపన్నపేట ఏడి మోహన్‌బాబు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మండలంలో రూ.1.50 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, సబ్ ఇంజనీర్ శేఖర్, శంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **పెద్ద చెరువుకు గండి.. పూడ్చిన అధికారులు**

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని యూసుఫ్‌పేట పెద్ద చెరువుకు శేరి తూము వద్ద గండి పడింది. శుక్రవారం అటుగా వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గుర్తించారు. వెంకటేశ్వర్‌రెడ్డి వెంటనే ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ విజయ్‌తో, సిబ్బంది జేసీబీ సాయంతో గండి పూడ్చి వేశారు.

◆ **రెడ్డి జాగృతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మల్లారెడ్డి**

చిన్నశంకరంపేట(మెదక్): రెడ్డి జాగృతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని సూరారం గ్రామానికి చెందిన జనగామ మల్లారెడ్డిని నియమిస్తు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందించారు.